విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అనంతగిరి మండలంలోని కొత్తూరు కేజీబీవీ పాఠశాలలో బుధవారం యుటిఎఫ్ నాయకులు ప్రచారం చేపట్టారు. పోరాడే అభ్యర్థులను చట్ట సభల్లో గెలిపించి పంపిస్తే గిరిజన, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక కర్షక సంస్యలపై మాట్లాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు, ఉమ్మడి జిల్లా సహాధ్యక్షులు శెట్టి రాంబాబు, అనంతగిరి మండల సహాయధ్యక్షులు సోమేల గంగరాజు, కోశాధికారి బూర్జ విజయకుమార్, జిల్లా కౌన్సిలర్ నారాయణ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

అయ్యన్న వ్యాఖ్యలపై ఆదివాసీల ఆగ్రహం

-1/70 చట్టం జోలికొస్తే ఊరుకోబోమని గిరిజనుల హెచ్చరిక

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం అటంకంగా ఉందని, గిరిజన చట్టాలను సడలించాలని స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యాటక అభివృద్ధి పేరుతో ఈ చట్టాన్ని సవరణలు చేస్తే మన్యం భూములు ఆక్రమణలకు గురవుతాయని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆదివాసీ ప్రజా సంఘాలతో పాటు సామాన్య గిరిజన ప్రజలు కూడా వ్యతిరేకత తెలుపుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భూ బదలాయింపు చట్టాన్ని సవరణలు చేయడం సరి కాదని ప్రకటిస్తున్నారు. చట్టాన్ని సవరణలు చేస్తే టూరిజం అభివృద్ధి కంటే దీన్ని ఆసరాగా తీసుకొని ఆక్రమణలే ఎక్కువ అవుతాయని పేర్కొంటున్నారు. గిరిజనుల రక్షణ కవచంగా ఉన్న ఈ చట్టం అమల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని యదేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా చర్యలు లేవన్నారు. ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసి ఈ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

చట్టం సవరిస్తే ఊరుకోం

మాకు చట్టం ఉండబట్టే మేము అడవుల్లో బతుకుతున్నాం. సవరిస్తే మాకు జీవనం ఉండదు. గతంలో కూడా 1/70 చట్టం సవరించాలని తెలుగుదేశం ప్రభుత్వం చూసింది. గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేసి సాధించుకున్నాం. టూరిజం వల్ల మేము బతకలేము. ఆదివాసులైన మాకు అడవులు ఉంటేనే జీవించగలం. బాక్సైట్ తీయడానికి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు.

కొర్ర సుందర్ రావు
గేటు వలస,
సుంకరమెట్ట పంచాయతీ,
అరకులోయ మండలం

1/70 చట్టంతో ఆదివాసీలకు రక్షణ

ఏజెన్సీలో 1/70 చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలి. దీంతో, భవిష్యత్తు తరాల గిరిజనులకు మేలు కలుగుతుంది. తమ పూర్వీకుల నుంచి మా చిన్ననాటి నుంచి పేదరికంతోనే కష్టాన్ని నమ్ముకుని ఈ భూములే జీవనాధారంగా కాయ కష్టం చేసుకుని జీవిస్తున్నాం. గిరిజనులంతా పేదవారే. రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలతో మనుగడ సాగించగలుగుతున్నాం.

కిల్లు కొండబాబు,
సీనియర్ సిటిజన్,
గురుపల్లి గ్రామం పాడేరు.

బాక్సైట్ తీయడానికి ప్రయత్నం

టూరిజం వల్ల మాకు ఒరిగేదేమీ లేదు.సుంకరమెట్ట పక్కనే కాఫీ తోటలో వుడెన్ బ్రిడ్జి ఫారెస్ట్ వాళ్ళు నిర్మించారు. అక్కడికి మేము వెళ్లినా టికెట్ తీయాలి. మా అడవులు మాకు ఉండాలి. మా చట్టం మాకు ఉండాలి. చట్టం సవరిస్తామని స్పీకర్ అయిన పాత్రుడు మాటలు వెనక్కి తీసుకోవాలి. లేకపోతే పోరాటం చేస్తాం.

కొర్ర కుమారి,
గేటు వలస,
సుంకరమెట్ట పంచాయతీ
అరకులోయ మండలం

చట్టాల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను పరిరక్షించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. గిరిజన హక్కులను కాల రాస్తే భవిష్యత్తు తరాలకు మనుగడ ఉండదు. ఏ ప్రభుత్వమైనా గిరిజన ప్రజల అభిప్రాయాలను మనోగతాన్ని పరిగణలోకి తీసుకోవాలి. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయి. గిరిజన యువతకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నెంబర్ త్రీ చట్టాన్ని పునరుద్ధరించాలి.

గడుతుల ఈశ్వరరావు, సుండ్రు పుట్టు. పాడేరు

అయ్యన్న వ్యాఖ్యలను ఖండించాలి

-ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి

ప్రజాశక్తి పాడేరు : టూరిజం అభివద్ధికి 1/70 చట్టం అడ్డుగా ఉందని చట్టం సవరించాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ 1/70 చట్టం పై తెలుగుదేశంపార్టీ వైఖరి ప్రకటించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన్యంలో పర్యాటక అభివృద్ధి కంటే గిరిజనుల మనుగడ, నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం జీవో నెంబర్ 3 రిజర్వేషన్ పునరుద్ధరణ కు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఆదివాసీగిరిజన మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.హైమవతి మాట్లాడుతూ, 1/70 చట్టానికి వ్యతిరేకమైన టూరిజం ప్రమోట్ చేస్తున్న అరకు చలి ఉత్సవాలను ఆదివాసీ సమాజం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు వీ.వీ జయ మహిళ సంఘం జిల్లా నాయకులు ఆదివాసీ గిరిజన మహిళ సంఘం నాయకురాలు కె. శశికళ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభావతి

చట్టాలకు ముప్పు వాటిల్లితే ఉద్యమానికి సిద్ధం

-అయ్యన్న వ్యాఖ్యలపై కూటమి నాయకులు స్పందించాలి- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసీల హక్కుల, చట్టాలకు ముప్పు వాటిల్లితే పదవిని వదిలి ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమని పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరు క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1/70 చట్టంలో సడలింపులు చేస్తే ఇన్వెస్టర్లు ముందుకు వస్తారంటూ స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు కనీసం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న మాటలకు కూటమి నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 1/70 భూ బదలాయింపు చట్టంపై స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలను ఆదివాసీ సమాజం తీవ్రంగా ప్రతిఘటిస్తోందన్నారు. శాసనసభ సభాపతిగా ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి చేయాల్సిన స్పీకర్ అయ్యన్న గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను మార్పు చేయాలని, సడలింపులు ఇవ్వాలని కోరడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆదివాసీల హక్కులు, చట్టాలు జోలికొస్తే ఎవరినైనా ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు. ఆదివాసి ప్రాంత హక్కులు, చట్టాలకు తూట్లు పొడవాలని చూస్తే ఆదివాసి సమాజం ఊరుకోదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

భూ బాధితుల ఆందోళనకు మద్దతు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణంకు భూములు దానం చేసిన భూదాతలకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు చేపట్టిన ఆందోళన బుధవారం ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏకలవ్య పాఠశాల ఆవరణ నిధిగా టెంట్ వేసి దీక్షలు చేపట్టి ఆందోళన చేపట్టారు. స్థానిక గిరిజన సంఘం నాయకులు పి సురేష్ కుమార్, పి సత్యనారాయణ పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం గిరిజన సంఘం నాయకుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న విలువైన భూములను ఇచ్చినా ఇప్పటికి వారికి ఉద్యోగాలు కల్పించకపోవడం సరికాదన్నారు తక్షణమే అధికారులు స్పందించి భూదాతలకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో భూములు ఇచ్చిన గిరిజనులు వారి కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలుపుతున్న నాయకులు

27న ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎన్నికలు

-నేటి నుండే ఎన్నికల కోడ్ అమలు- కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయుల నియోజకవర్గం సభ్యుల కాలపరిమితి, అదేవిధంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గం సభ్యుల కాలపరిమితి మార్చి 29 తో ముగియనున్న నేపథ్యంలో ఆయా నియోజక వర్గాల సభ్యుల ఎన్నికలను ఎన్నికల కమిషన్ ప్రకటించిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు నియోజక వర్గాలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని, 10వ తేదీ వరకు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. 11వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుందని, 13వ తేదీ లోగా నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, మార్చి మూడున కౌంటింగ్ ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియామావళి తక్షణమే ఈనెల 30 వ తేదీ నుండి అమలులోకి వస్తుందని కలెక్టర్ స్పష్టం చేసారు..

రహదారి మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని వనుగుమ్మ పంచాయతీలో మొక్కపుట్టు జంక్షన్ నుండి పెద్దసింధిపుట్టు వరకు ఉన్న రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని పనస గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మహాదేవ్, గణపతి మాట్లాడుతూ రహదారి పెచ్చులూడి, గోతులు ఏర్పడి ప్రమాదకరంగ మారిందన్నారు. గ్రామ సమీపంలో బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని తెలిపారు. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డుడుమ డామ్ నుండి దోడిపుట్టు జంక్షన్ వరకు ఇదే ప్రధాన రహదారి కావటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతుందన్నారు. ఈ మార్గంలో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయన్నారు. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్ళాలన్నా అనేక అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే రహదారితో పాటు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొండ బుద్దు, కామేష్, శ్యాము, మోహందాస్, సాధురం, శుక్ర, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహిళలు

పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

- సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు
- విలీన మండలాల్లో ఉత్సాహంగా సాగిన పోలవరం పోరాట పతాక యాత్ర

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ పెనుమల్లి మధు స్పష్టం చేశారు. సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో కూనవరం మండలం బొజ్జరాయిగూడెంలో బుధవారం ఉదయం ప్రారంభమైన పోలవరం నిర్వాసితుల పోరాట పతాక యాత్ర చింతూరు చేరుకుంది. ఈ సందర్భంగా చింతూరు సిపిఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మధు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఎకరాకు కేవలం లక్ష రూపాయలు మాత్రమే పరిహారం అందజేసి నిర్వాసితులకు అన్యాయం చేసిందని తెలిపారు. తరువాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కూడా నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తి చేయకుండా ప్రాజెక్టు పనులు చేసిందన్నారు. వైయస్.జగన్ ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఎన్నో తరాలుగా అక్కడే జీవిస్తున్న నిర్వాసితులు తమ భూములు, ఇళ్లు, ప్రకృతి వనరులు, అన్నింటినీ త్యాగం చేసిన ముంపు మండలాల నిర్వాసిత ప్రజానీకానికి ఎకరాకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ దేవీపట్నం మండలంలో గ్రామాలన్నీ ముంపునకు గురైనా వారికి సరైన పునరావాసం, పరిహారం కల్పించకుండా బలవంతంగా ఖాళీ చేయించారని తెలిపారు. గత వైసిపి, నేటి టిడిపి ప్రభుత్వాలు కేంద్రంలోని బిజెపి కనుసన్నల్లో నడుస్తూ నిర్వాసితులకు తీరని అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు.

విఆర్.పురం : పోలవరం పోరాట పతాక యాత్ర చింతూరు నుండి విఆర్.పురం మండలంలోకి చొప్పల్లి వద్ద అడుగుపెట్టింది. అక్కడ నాయకులకు స్థానికులు తిలకం దిద్ది పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడారు. అనంతరం యాత్ర అక్కడ నుండి సోములు గూడెం, రామవరం, అడవి వెంకన్నగూడెంకు చేరుకుంది. అక్కడ మాజీ ఎమ్మెల్యే కుంజా బుజ్జి స్థూపానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుండి సున్నవారిగూడెంకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య, మాజీ ఎంపీపీ కారం శిరమయ్య స్థూపాలకు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అక్కడనుండి రేఖపల్లిలో పార్టీ నాయకులు పూనెం సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు రేఖపల్లి జంక్షన్ వద్ద జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడారు.

కూనవరం : పోలవరం నిర్వాసితుల పోరాట పతాక యాత్రను కూనవరం మండలం బొజ్జరాయిగూడెంలో సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు బుధవారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఏటా వరదలకు నిర్వాసితులు మునుగుతూ ఆర్థికంగా దెబ్బతింటుంటే ప్రభుత్వాలు పప్పు ఉల్లిపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. సర్వేల పేరుతో ముంపు వాసులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సరైన సర్వేలు జరిపి త్వరితగతిన ప్యాకేజీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం చింతూరు, విఆర్.పురం మండలాలను సందర్శించి సాయంత్రం కూనవరం చేరుకుంది. కూనవరంలో జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినప్పటి నుండి ప్రభుత్వాలు మారుతున్నాయి గాని పునరావాసం ప్యాకేజీ ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టర్ల దగ్గర డబ్బులు దండుకోవడం తప్ప ప్రజలకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. ముంపునకు గురయ్యే ప్రతి రైతుకీ ఒకటికి నాలుగు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, సున్నం రాజులు, విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, సోయం చిన్నబాబు, మడకం నాగమణి, మేకల నాగేశ్వరరావు, కూనవరం, విఆర్.పురం, చింతూరు మండల కార్యదర్శులు బాబు బొర్రయ్య, పులి సంతోష్‌కుమార్, పల్లపు వెంకట్, పార్టీ మూడు మండలాల నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పోడియం శ్రీరామ్మూర్తి, పి.లక్ష్మణ్, పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లది రమేష్. పులి బుజ్జి, కారం సత్తిబాబు, సోడి మల్లయ్య, సర్పంచ్ లక్ష్మి, కే సత్యనారాయణ, ప్రకాష్‌రావు, కాంతారావు, జి.లక్ష్మణరావు సుబ్బమ్మ, పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

ఎటపాక : పోలవరం నిర్వాసితుల తరపున పోరాడే సిపిఎంకు మద్దతునిచ్చి నిర్వాసితుల సమస్యను పరిష్కరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. నిర్వాసితుల పతాక యాత్ర జీపు జాతా బుధవారం రాత్రి ఎటపాక మండలం మురుమూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా సభలో దడాల సుబ్బారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులందరూ ఐక్యంగా నిలబడి పోరాడితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులతో పాటు మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర తదితరులు పాల్గొన్నారు.

జాతాలో పాల్గొన్న నాయకులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆసుపత్రిలో కాన్పుకు గిరిజన గర్భిణీ నిరాకరణ

- కౌన్సెలింగ్ చేసి ఆసుపత్రికి తరలించిన వైద్యాధికారి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయితీ జెర్రెలబంద గ్రామానికి చెందిన నిండు గర్భిణీ గమ్మెల రాధ ఆసుపత్రిలో కాన్పు పొందడానికి నిరాకరించింది. రాధకు నెలలు నిండడంతో ఆమెను ఆసుపత్రికి రావాలని జికె.వీధి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు సూచించారు. అయితే రాధ ఆస్పత్రిలో కాన్పు పొందడానికి నిరాకరించింది. అనంతరం కాపీ తోటలో కాఫీ పళ్ళు సేకరించడానికి వెళ్ళిపోయింది. విషయం తెలుసుకున్న వైద్యాధికారి జె.అచ్చుతా తన సిబ్బందితో కాఫీ తోట వద్దకు వెళ్లి రాధకు మూడు గంటల పాటు కౌన్సిలింగ్ నిర్వహించి నచ్చజెప్పారు. అనంతరం ఆమె అంగీకరించడంతో అంబులెన్స్‌లో జీకే వీధి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏజెన్సీలో మూఢనమ్మకాలు కారణంగానే ఆసుపత్రిలో కాన్పుకు రావడం లేదని వైద్యాధికారి తెలిపారు.

గర్భిణిని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

సచివాలయంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని పెద్ద గెద్దాడ సచివాలయాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ పని తీరును గురించి అడిగి తెలుసుకున్నాను. ఉద్యోగులందరూ కూడా విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించాను. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణ, జనసేన నాయకులు రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు

- ప్రజాశక్తి కథనానికి స్పందించిన డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీలేరు బాలికల ఆశ్రమం పాఠశాలలో హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులను నియమించడానికి చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. 'హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయుల కొరత' శీర్షికన ప్రజాశక్తి బుధవారం ప్రచురించిన కథనానికి డిఇఒ స్పందించారు. ఆయా పాఠశాలకు ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులు నియమించడానికి చర్యలు చేపట్టాలని కింద స్థాయి అధికారులను ఆదేశించారు. దీంతో జీకే వీధి ఎంఇఒలు సత్యనారాయణ, రామన్న స్పందించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు సూర్య కుమారుని ఇంగ్లీషు టీచర్‌గా తాత్కాలికంగా నియమించినట్లు పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కాలేశ్వరరావు వెల్లడించారు. అలాగే సీలేరు బాలికల ఆశ్రమం పాఠశాలకు డిప్యూటేషన్ ప్రాదిపదికన తాత్కాలికంగా సీలేరు ఏపీ గురుకుల పాఠశాలలో ఔట్ సోర్సింగ్‌గా విధులు నిర్వహిస్తున్న హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా ఎం.గోపాలరావు, ఎం.సత్యమూర్తిని నియమిస్తూ చర్యలు తీసుకున్నామని జీకే వీధి ఏటిడబ్ల్యూ నాగజయలక్ష్మి తెలిపారు. హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కొరతపై ప్రజాశక్తి కథనం ప్రచురించడం, అధికారులు స్పందించి ఆయా పాఠశాలకు తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియామకం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా?
అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు,
ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని
ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		

మాట్లాడుతున్న హౌసింగ్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బాబు

త్వరితంగా గృహాలను నిర్మించాలి

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు :మండలంలో కిలగాడ పంచాయతీలో గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ బాబు బుధవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. కిలగాడ గ్రామ పంచాయతీ పరిధిలోని తడిగిరి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పీఎం జన్మన్ గృహాలను పరిశీలన చేశారు. గృహ లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ, త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు.ప్రభుత్వ నిర్దేశించిన కాల పరిమితిలో గృహాల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా పనులు వేగవంతం చేయాలన్నారు. మండలంలో పీఎం జన్మన్ పథకం లో సుమారు 3,400 గృహాలు మంజూరు చేసామన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ సిహెచ్ కృష్ణారావు మాట్లాడుతూ, గహాలకు అర్హులైన లబ్ధిదారులు ఈకేవైసీ చేయించిన తర్వాత ఆధార్ కార్డులు అప్డేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. లబ్ధిదారులందరూ సర్వే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణారావు , హేమలత పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న పశు వైద్యులు

పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: పశు వైద్య శిబిరాలను గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సుబీత కోరారు స్థానిక పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ గసభ లోగిలి గ్రామంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు ఈ సందర్భంగా పశువులు, గొర్రెలు, మేకలకు వ్యాధినిరోధక టీకాలను వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గిరి రైతులు వ్యవసాయంతో పాటు గొర్రెలు, మేకలు తోపాటు కోళ్ల పెంపకోవడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్ వార్డు సభ్యులు సత్యనారాయణ, ఏహెచ్ఎలు అప్పారావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి:మండలంలోని ఉర్లకులపాడు, తాళ్లపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో 250 పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తరుణ్ తెలిపారు. గొర్రెలు, మేకలు ఆవులు, గేదెలకు నట్టల నివారణ మందులు కూడా వేసినట్లు చెప్పారు. రైతులు తమ పశువులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

హమ్ హై హిందుస్తానీ పాటకు విశేష ఆదరణ

ప్రజాశక్తి - విశాఖ కల్చరల్ : గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ నెల 26న డైరెక్టర్, రచయిత సుధీర్ సాయి తన నిర్మించిన "సబ్కా మాలిక్ ఏక్ హై" నుండి "హమ్ హై హిందుస్తానీ" అనే పాటను యూట్యూబ్ ఛానెల్లో విడుదల చేశారు. ఈ పాటకు ప్రజల నుండి అద్భుతమైన సానుకూల స్పందన లభించిందని, సుధీర్ సాయి మీడియాకు తెలిపారు. ఈ పాటను తంగిరెడ్డి జ్యోతి సాయి (సుధీర్ సాయి) రచించగా, ప్రమోద్ కుమార్ పారిశర్ల సంగీతం సమకూర్చారు. ఆరెజ మధు కార్తిక్ ఈ పాటను గానం చేశారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జెసి అభిషేక్ గౌడ్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్

ప్రజాశక్తి -పాడేరు : మార్చి ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగనున్నందున పరీక్షా కేంద్రాల వద్ద కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని, పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఎం.జె అభిషేక్ గౌడ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై జరిగిన సమీక్షా సమావేశంలో జేసి మాట్లాడుతూ మార్చి ఫిబ్రవరి ఐదవ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు మధ్యాహ్నం 2 నుండి 5 వరకు జిల్లా వ్యాప్తంగా 60 కళాశాలలలో జరుగుతాయన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు 26 కేంద్రాలలో జరుగుతాయని వివరించారు. ఈ పబ్లిక్ పరీక్షలు 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక చేసిన 26 కేంద్రాలలో నిర్వహిస్తామన్నారు. అందులో పాడేరు డివిజన్ లో 16 కేంద్రాలు, రంపచోడవరం డివిజన్‌లో ఏడు కేంద్రాలు, చింతూరు డివిజన్ లో మూడు కేంద్రాలు గుర్తించడం జరిగిందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రం చుట్టుపక్కల జిరాక్స్ షాపులు మూసివేయించాలని, తాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు. ఒక ఎఎన్ఎం ను కేటాయించి హెల్త్ కిట్ సిద్ధంగా ఉంచాలని, కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని జేసీ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేయాలని, అన్సర్ షీట్లను రిసెప్షన్ కేంద్రం నుండి పోస్ట్ ఆఫీస్ వరకు పోలీసు వారి సహకారంతో జాగ్రత్తగా తరలించాలని ఆదేశించారు. రంపచోడవరం, చింతూరుకు సంబంధించి రాజమండ్రి ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయంలోను, పాడేరు డివిజన్ సంబంధించి అనకాపల్లి జూనియర్ కళాశాలలోను డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డివిఇఓ. కె. అప్పల రామ్, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్ రజని, డిఈఓ పి. బ్రహ్మాజీరావు, ఎపిసి స్వామి నాయుడు, డిఎంహెచ్ఓ జమాల్ బాషా, డిపిఆర్ఓ పి. గోవింద రాజులు, ఇపిడిసిఎల్, పోస్టల్, ఆర్టీసి శాఖల ప్రతినిధులు, పాల్గొన్నారు.

అరకు ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి అరకు లోయరూరల్: అరకు చలి ఉత్సవం పర్యాటకులకు కను విందు చేయబోతోంది. ఆంధ్రా ఊటీ అరకులోయ కేంద్రంలో చలి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 31, వచ్చేనెల 1,2 తేదీల లో అరకు వ్యాలీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చలి అరకు ఉత్సవానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అరకు వ్యాలీ అందాలు, ఆచార సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఉత్సవం ఏర్పాటు చేస్తున్నారు. ప్యారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్ మూడు రోజుల పాటు, రంగ వల్లులు ధింసా, వివిధ గిరిజన నృత్యాలు ఏర్పాటు చేస్తున్నారు. పద్మాపురం గార్డెన్ పూల ప్రదర్శన చేయడం జరుగుతుంది. వివిధ రాష్ట్రాల నుండి గిరిజన కళాకారులు అరకు ఉత్సవంలో పాల్గొంటారు. దేశ నలు మూలల నుండి గిరిజన కళాకారులు వస్తున్నారు.గిరిజన ఉత్పత్తులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. గిరిజన ఫుడ్ కోర్టు, బస్తర్ బ్యాండ్ ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేస్తున్న ఎగ్జిబిషన్లు

పారాగ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్ ను అందుబాటులోకి తీసుకుని వచ్చారు. హెలికాఫ్టర్లో విహరించడానికి ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్య కలగకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బొర్రా జంక్షన్ నుండి డిగ్రీ కళాశాల మైదానం వరకు సైక్లింగ్ నిర్వహిస్తున్నారు. అరకు వ్యాలీ పట్టణంలో ఐదు కిలో మీటర్ల మారథాన్ రన్ నిర్వహిస్తారు. పర్యాటకులను ఆకర్షించేలా అన్ని ఏర్పాటు చేస్తున్నాము.

నేటి నుంచి ఆర్థోపెడిక్ వర్క్ షాప్

కెజిహెచ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టేట్ ఆఫ్ ఆర్థోపెడిక్ వర్క్ షాప్‌ను ఈ నెల 30 నుంచి నాలుగు రోజులపాటు నగరంలో నిర్వహిస్తున్నట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. బుధవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30 నుంచి 2వ తేదీ వరకు విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒఎస్ఎస్ఎపిసిఒఎన్-2025 ఎక్సలెన్స్ ఎక్రాస్ ఆల్ డైమెన్షన్స్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ అనే నినాదంతో వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్క్ షాప్‌లో వెయ్యి మంది ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఆర్థోపెడిక్ ఫ్యాకల్టీ భాగమవుతారని, 400 మంది పత్రాలను సమర్పిస్తారని తెలిపారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ అంబేద్కర్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ వైద్యులు, పద్మశ్రీ సుంకర ఆదినారాయణను సన్మానించనున్నట్లు తెలిపారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

మావోయిస్టు కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో అత్యంత మారుమూల పంచాయతి రంగాబయులు గ్రామంలో స్థానిక ఎస్సై రామకృష్ణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మావోయిస్టుల కార్యకలాపాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. మారుమూల గ్రామాలలో మౌలిక సదుపాయాలైన రోడ్డు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు లేక పోవడంతో అభివృద్ధికి నోచుకోని జీవిస్తున్నారన్నారు.గంజాయి, నాటు సారా మత్తులో మునిగి జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురి కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల, 269 జిల్లా పరిషత్, కెజిబివి, గిరిజన సంక్షేమం, మరియు హై స్కూల్ ప్లస్ పాఠశాలలో చదువుచున్న విద్యార్థినులకు రాణి లక్ష్మీ భాయి ఆత్మ రక్ష పరిరక్షణ పథకం కింద శిక్షణ అందించడానికి అర్హత గల సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త స్వామి నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు 20 సెషన్స్ క్రింద కరాటి లేధా తైక్వాండో వంటి యుద్ధ కళల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వివిధ నిబంధనల ప్రకారం ఆయా యుద్ధ కళల్లో కనీసం 3 సంవత్సరములు నుండి ఉనికిలో ఉండి విద్యార్థినులకు శిక్షణ ఇచ్చుచున్న సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి, అర్హత గల సంస్థలు సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తును పూర్తిచేసి ఫిబ్రవరి ఒకటవ తేదీ లోగా సమర్పించాలన్నారు.

రాడార్‌పై విజయం సాధించిన డ్రైవర్లకు అభినందనలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఓలాలో కొత్తగా ప్రవేశపెట్టిన బ్రాడ్ కాస్ట్ (రాడార్) ట్రిప్స్ విధానం వల్ల చాలా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నందున, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాడిన డ్రైవర్ల అభ్యర్థనను మన్నించి రద్దు చేశారు. దీంతో డ్రైవర్లు విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ ముందుగా డ్రైవర్లకు అభినందనలు తెలిపారు. గతంలో ఒక బుకింగ్ ఒక డ్రైవర్‌కు మాత్రమే వెళ్లేదని, ఆ బుకింగ్ మొబైల్ స్క్రీన్‌పై ఎక్కువసేపు ఉండేదన్నారు. రాడార్‌తో ఒక బుకింగ్ ఐదుగురు డ్రైవర్లకు వెళ్తుందని, మొబైల్ స్క్రీన్‌పై ఒక్క సెకండ్‌లో పోతుందని, ఎవరు ముందుగా యాక్సెప్ట్ చేస్తే వాళ్లకి బుకింగ్ ఓకే అవుతుందని తెలిపారు. దీంతో డ్రైవర్లు బుకింగ్ కోసం అదేపనిగా మొబైల్ చూస్తూ ఉండాల్సి వచ్చేదని వివరించారు. అందువలన ఈ రాడార్ ట్రిప్స్ తీసివేయాలని సోమవారం నుంచి వైజాగ్ సిటీలో తిరిగే డ్రైవర్స్ ఓలా బంద్ చేయడంతో యాజమాన్యం బుధవారం చర్చలకు ఆహ్వానించి, ఒక బుకింగ్ ఇద్దరు డ్రైవర్లకు వచ్చే విధంగా, మొబైల్ స్క్రీన్ పై ఒక బుకింగ్ 15 సెకండ్‌లు ఉండే విధంగా 10 రోజులలో మార్పు చేస్తామని ఒప్పందం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, పోలినాయడు, నాయకులు ఆనంద్, అబ్బాయి, శ్రీను, నాయుడు, పాల్గొన్నారు.

అయ్యన్న వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛమైన ప్రకటన చేయాలని సిపిఎం జికె.వీధి మండల కమిటీ సభ్యులు గడుతూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1/70 చట్టం సవరణ ద్వారానే ఏజెన్సీ ప్రాంతానికి పెట్టుబడులు వస్తాయని విశాఖలో జరిగిన ప్రాంతీయ పెట్టుబడుదారుల సదస్సులో అయ్యన్నపాత్రుడు అనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధ పదవులో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. టూరిజం ద్వారానే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి సాధ్యమనే తప్పుడు అభిప్రాయంతో పాలకులు ఉన్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేయవలసిన ప్రభుత్వాలే టూరిజం పేరుతో వందలాది ఎకరాల భూములను ఇప్పటికే ఆక్రమించారని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చిన్న తరహా పరిశ్రమలను ఐటిడిఎ ద్వారా ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. గతంలో బాక్సైట్ తవ్వకాలకు 1/70 చట్టం అడ్డుగా ఉందని, దానిని సవరణ చేయాలని నాటి టిడిపి ప్రభుత్వం గిరిజన సలహా మండలిలో తీర్మానం పెట్టిందని, నాడు సిపిఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాత్రమే దాన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. అటువంటి కుట్రలను మళ్లీ టిడిపి ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు.

గిరిజన చట్టాలపై మాట్లాడే హక్కు అయ్యన్నకు లేదు

మారేడుమిల్లి : గిరిజన చట్టాలపై మాట్లాడే హక్కు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి లేదని మారేడుమిల్లి మాజీ ఎంపీటీసీ, గిరిజన నాయకులు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబి) బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1/70 యాక్ట్ చట్టం సవరణతో గిరిజన ప్రాంతంలో పెట్టుబడులు వస్తాయని ఆయన మాట్లాడటం సరికాదు. గిరిజన చట్టాలు, హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. గిరిజన చట్టాలను కాల రాస్తే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు.

1/70 చట్టం జోలికి వస్తే ఖబడ్దార్

దేవీపట్నం : 1/70 చట్టాలన్ని సవరించాలని చూస్తూ ఖబడ్దార్ అని ఆదివాసీ జేఏసీ నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ ప్రభుత్వానికి ఆదివాసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో అరకులో చంద్రబాబు నాయుడు, పాలకొండ వేదికలో పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లు జీఓ నెంబర్3ను పునర్ధరించి ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

స్పీకర్ వ్యాఖ్యలు సరికాదు: కాంగ్రెస్

అరకులోయ :1/70 చట్టం సవరించాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఏపీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాచిపెంట చిన్నస్వామి అన్నారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన హామీ జి ఓ 3కు చట్టబద్ధత కల్పించకుండా, టూరిజం పేరుతో చట్టాలను సవరించాలని అనడం సరికాద న్నారు. గిరిజనులకు 1/70 చట్టం రాజ్యాంగము కల్పించిందన్న విషయం తెలుసుకోవాలన్నారు. గిరిజనుల సంపద దోచి పెట్టడానికి ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి భగత్ రామ్, డుంబ్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తడబారికి భీమారావు, యూత్ కాంగ్రెస్ నాయకుడు కిల్లో దశమత్ పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలను వెలికి తీస్తా

ప్రజాశక్తి-దేవీపట్నం:అవినీతి, అక్రమాలను వెలికి తీస్తానని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సమాచార హక్కు చట్టం కమిటీ ఏఎస్ఆర్ జిల్లా కార్యదర్శి బొంతు చక్రి అన్నారు. దేవీపట్నం మండలం ఇందుకూరు పేట గ్రామానికి చెందిన బొంతు చక్రి సమాచార హక్కు చట్టం కమిటీ ఏఎస్ఆర్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ అవినీతి అక్రమాలను వెలికి తీసి న్యాయస్థానం ద్వారా పరిష్కరించడం, నిరుపేద సామాన్యులకు న్యాయ సలహాలు అందివ్వడం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడటం, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటానికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. చక్రి ఎన్నికపై ఇందుకూరుపేట సర్పంచ్ కారం కృష్ణబాబు, ఆదివాసీ జెఎసి నాయకులు తెల్లం శేఖర్, యలగడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర అభినందించారు.

కోతుల నియంత్రణకు చర్యలు

ఎపి జెన్‌కో హైడెల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్

ప్రజాశక్తి -సిలేరు ం జికె విధి మండలం సిలేరులో కోతులను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని ఏపీ జెన్కో హైడెల్ డైరెక్టర్ సుజయ్ కుమార్ సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్సీ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. సీలేరులో రెండు సంవత్సరాల క్రితం వందల సంఖ్యలో ఉన్న వానరాలు ప్రస్తుతం వృద్ధి చెంది 1000 పైగా పెరిగిపోయి స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇంటికి పైకప్పులపై స్వైర్య విహారం చేస్తూ టెలిఫోన్ వైర్లు విద్యుత్ వైర్లపై వేలాడుతూ నాన ఇబ్బందులు గురి చేస్తున్నాయి. దుకాణాల్లోకి చొరబడి తినుబండారాలు ఎత్తుకుపోయి ఇంటిపై కప్పులపై దర్జాగా ఆరగిస్తున్నాయి. చిన్నారులు పాఠశాలకు వెళ్లే సమయంలో వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ వారి చేతిలో ఉన్న తినుబండారులను ఎత్తుకుపోతున్నాయి. మహిళలు బాత్రూంలో స్నానం చేసేటప్పుడు సమస్యలకు గురి చేస్తున్నాయి. జెన్కో కాలనీలో రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇళ్ల పైకప్పులపై కుప్పుగెంతులు వేస్తూ అలజడి సృష్టిస్తున్నాయి. పెరటిలోని పూలు, తోటలు, కూరగాయలు, ఆకుకూరలు తోటలను పాడు చేస్తున్నాయి. వీటి నివారణ చర్యలు చేపట్టాలని అనేకసార్లు చేపట్టాలని పత్రికలు కథనాలు ప్రచురించాయి.

ఈ కోతుల సమస్యను సీలేరు కాంప్లెక్స్‌లో పర్యటించిన

ఎస్ఇకి సూచనలు చేస్తున్న జెన్‌కో హైడెల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్

వచ్చిన హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్, చీఫ్ ఇంజనీరింగ్ వాసుదేవరావు దృష్టికి స్థానిక విలేకరులు తీసుకొచ్చారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించి మోతుగూడెం తరహాలో కోతులను నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఈఈలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈలు అప్పలనాయుడు, దుర్గా శ్రీనివాస్, ఏఇఇ సిహెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీసా కమిటీ సభ్యులకు అవగాహన

బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం :ఏజెన్సీ ప్రాంతంలోని నూతనంగా ఎన్నికైన పీసా కమిటీ సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం మండలం పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏజెన్సీలోని 120 పంచాయతీ పరిధిలో నూతనంగా ఎన్నికైన పీసా కమిటీ ఉపాధ్యక్షులకు, కార్యదర్శులకు, పంచాయతీల సర్పంచులకు, పీసా గ్రామ కమిటీ అధికారాలు, తీర్మానాలపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పిఒ కట్టా సింహాచలం మాట్లాడుతూ పీసా కమిటీ సభ్యులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఒక వారధిగా పనిచేయాలని సూచించారు. ఈ పిసా కమిటీ సభ్యులు పీసా చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులతో ఎన్నిక కాబడిన పీసా కమిటీ గ్రామ సభలకు ప్రత్యేకమైన అధికారాలు ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి నెల నాలుగో తారీఖు నుండి మండల స్థాయిలో సర్పంచులకు, పిసా ఉపాధ్యక్షులకు, కార్యదర్శులకు పిసా చట్టంపై పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని గిరిజనులు సంస్కృతిక సాంప్రదాయాలు కాపాడుకుంటూ గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా పీసా గ్రామ కమిటీల ద్వారా తీర్మానాలు చేయాలని సూచించారు. రాష్ట్ర గిరిజన అడ్వైజర్ పళ్ళ త్రినాధ రావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని గిరిజనులకు కొన్ని చట్టాల ద్వారా ప్రత్యేకమైన హక్కులు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ముందుగా పీసా చట్టానికి సంబంధించిన బుక్లెట్లను ప్రాజెక్ట్ అధికారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ జనరల్ డీఎన్వి రమణ, సబ్ డిఎఫ్ఓ అనూష, ఉపాధి హామీ ఎపిడి జి.శ్రీనివాసరావు, ఎంపీడీవో యస్. శ్రీనివాసరావు దొర, పిహెచ్ఓ కే.చిట్టిబాబు, పిఎఓ యల్.రాంబాబు, ఏడిఏ సిహెచ్ కెవి చౌదరి, వ్యవసాయ శాఖ అధికారి కె.లక్ష్మణ్, డిపిఎం అపర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు

ఆర్ఆర్ కాలనీ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-దేవీపట్నం :గోకవరం మండలం గంగాలమ్మ తల్లి ఆలయ సమీపంలో ఉన్న దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, గ్రామమ నిర్వాసితులు బుధవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీకి ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్ ఆర్ కాలనీలో కాలనీకు గోతులు లేకుండా మట్టితో లెవెల్ చెయ్యాలని కోరారు. దీనికి స్పందించిన ఆమె శుక్రవారం కాంట్రాక్టర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో దేవీపట్నం కాలనీ కమిటీ సభ్యులు గేదెల పెద్ద సుబ్బారావు, లంకా పోసి రావు, దొడ్డపోసి బాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

పామాయిల్ సాగుపై అవగాహన

అవగాహన కలిగిస్తున్న పతంజలి ఫుడ్స్ ఉద్యోగులు

ప్రజాశక్తి-రంపచోడవరం : పామాయిల్ తోటలు సాగుపై మండలంలోని బీరంపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ రైతులకు బుధవారం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ కంపెనీ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పతంజలి సంస్థ అధికారులు ఆయిల్ పామ్ తోటల ప్రాముఖ్యత, రైతులకు కంపనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువులు యాజమాన్యం, సాగులో విజయం సాధించిన రైతుల విజయ గాథల గురించి వివరించారు. సంస్థ సీనియర్ ఆఫీసర్ డిఎస్ శ్రీనివాస్ పామాయిల్ సాగుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న ప్రోత్సాహకాలు, సూక్ష్మ సేద్యంలో ఇస్తున్న రాయితీలు గురించి రైతులకు వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ కె.కార్తీక్ రెడ్డి ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, చీడపీడల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి ఉమామహేశ్వరరావు ఫీల్డ్ సూపర్వైజర బి.రామకృష్ణ, అధిక సంఖ్యలో పామాయిల్ రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కూనవరం :మండలంలోని పంద్రాజుపల్లి గ్రామానికి చెందిన పోడియం దుర్గారావు అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. విషయం తెలుసుకున్న జెకెసి ట్రస్ట్ చైర్మన్, ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. మృతుని భార్య లక్ష్మికి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అప్పారావు, ఉమామహేశ్వరరావు,

ఆర్థిక సాయం అందిస్తున్న జమాల్‌ఖాన్

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం, సిరిగిందలపాడు విద్యుత్ లైన్ల మారమ్మతులు, లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న కారణంగా రంపచోడవరం, సిరిగిందలపాడు పరిసర ప్రాంతాలకు ఈ నెల 31న శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరంచాలని కోరారు.

'ఏకలవ్య'లో ప్రవేశాలకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :ఏకలవ్య విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నిర్వహిస్తున్నట్లు స్థానిక ఏకలవ్య ప్రిన్సిపల్ కృష్ణారావు బుధవారం విలేకరులకు తెలిపారు. రాజవొమ్మంగి విద్యాలయంలో ఆరవ తరగతిలో 60 సీట్లు, ఏడో తరగతిలో 6, 9వ తరగతిలో ఒక సీటు భర్తీకి ఫిబ్రవరి 25న ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. మెంటల్ ఎంబిలిటీ 50 మార్కులు, అర్థమెటిక్ 25 మార్కులకు, ఆబ్జెక్టివ్ పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు.